క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు



వెంకటాచలం: మండలంలోని పూడిపర్తి గ్రామంలో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ కానుకల్ని గురువారం లెక్కించారు. రూ.1,09,759ల రాబడి వచ్చిందని దేవస్థానం ఈఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కొండ్లపూడి గ్రూప్ దేవస్థానం ఈఓ కేవీపీ ప్రసాద్, వీఆర్వో భగవాన్, స్థానికులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సత్కారం



ముత్తుకూరు: ఢిల్లీలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు రజత పతకం సాధించింది. మండలంలోని దమ్మాయపాళెం జెడ్పీ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసే బూదూరు రాంబాబు ఏపీ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించిన రాంబాబును గురువారం విద్యార్థుల సమక్షంలో హైస్కూల్ హెచ్ఎం గురుప్రసాద్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

గంగవరంలో 'పొలం పిలుస్తోంది'



మాట్లాడుతున్న ఏడీఏ సుజాత

కోవూరు: రైతులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ సుజాత కోరారు. మండలంలోని గంగవరం గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొని, రైతులకు పలు సూచనలు చేశారు. స్థానికంగా పెసలు పంటను సందర్శించి, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. సమావేశంలో ఏఓ ఇందిరావతి పాల్గన్నారు.

విద్యుదాఘాతానికి రైతు బలి

- వెంగమాంబాపురంలో విషాదం

సైదాపురం(బాలాయపల్లి): పొలం పనులు చేసుకుంటున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన మండలంలోని బాలాయపల్లి మండలంలోని వెంగమాంబాపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వెంగమాంబాపురానికి సాధనాల పద్మయ్య నాయుడు (35) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. గురువారం పొలానికి వెళ్లాడు. సాగునీరందించేందుకు మోటార్ స్విచ్ వేయగా విద్యుత్ షాక్‌కు గురై పద్మయ్య మృతిచెందాడు. పశువులకాపరులు పద్మయ్య కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. వారు పొలం వద్దకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న పద్మయ్యను చూసి కన్నీరుమున్నీరుగా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

బాబా మందిరంలో విశేష పూజలు




పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది.

టీడీపీ నేతలు దుర్భాషలాడారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్

కోవూరు : టీడీపీ నేతలు తనను దుర్భాషలాడారని, అవమానకరంగా దూషించారని కోవూరు మండలం గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీడీపీ నేతలు మన్నేపల్లి శివకుమార్, ప్రసాద్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, తగిన న్యాయం చేయాలని కోరారు.



పీఆర్ గుంట రక్షిత నీటి పథకం ఇలా..



అసంపూర్తిగా ఉన్న నారికేళపల్లి రక్షిత నీటి పథకం



శిథిలమైన కృష్ణపట్నం రక్షిత నీటి పథకం

సకాలంలో పూర్తయ్యేనా?

- తాగునీటి పథకాల నిర్మాణంలో జాప్యం
- అసంపూర్తిగా 14 పథకాలు
- 8 చోట్ల స్థలాల కొరత
- వేసవిలో తాగునీటి ఎద్దడి తప్పదా..

ముత్తుకూరు: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో మండలంలో తాగునీటి సౌకర్యం, సమస్యలపై అధికారులు సరైన శ్రద్ధ చూపడం లేదు. గత ప్రభుత్వం రక్షిత మంచినీటి పథకాలను మంజూరు చేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో తాగునీటి సమస్యలు వస్తాయేమోనని జనం ఆందోళన చెందుతున్నారు.

ముందుచూపుతో..

మండలంలో మొత్తం 48 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. ఇందులో 10 వరకు నిరుపయోగంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుచూపుతో రూ.24 లక్షల అంచనాలతో 22 రక్షిత మంచినీటి పథకాలను మంజూరు చేసింది. ఇందులో వివిధ గ్రామాల్లో 14 రక్షిత నీటి పథకాల నిర్మాణాలు కొంతమేర జరిగాయి. పూర్తయ్యే దశలో కూటమి ప్రభుత్వం వచ్చింది. ఇక నిధుల్లేక వీటి నిర్మాణాలు ఆగిపోయాయి. కాగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఇటీవల అనుమతి ఇచ్చింది. అయితే సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగి, పనులు పూర్తవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

స్థలాల్లేక..

గత ప్రభుత్వం మంజూరు చేసిన వాటిల్లో 8 రక్షిత మంచినీటి పథకాల నిర్మాణానికి గ్రామాల్లో స్థలాల కొరత ఏర్పడింది. ఇందులో రంగాచార్యులకండ్రిగ, గుంటకట్ట, కావలి దళితవాడ, మామిడిపూడి తదితర గ్రామాలున్నాయి. కాగా అసంపూర్తిగా ఉన్న మంచినీటి పథకాల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. జూన్ మాసం నాటికి పనులు పూర్తవుతాయని ఆర్ డబ్ల్యూఎస్ ఇంజినీర్లు చెబుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



మండలంలో అసంపూర్తిగా రక్షిత మంచినీటి పథకాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలి. ప్రభుత్వం కూడా సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిపి, సహకరించాలి. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– గండవరం సుగుణ, ఎంపీపీ, ముత్తుకూరు

యుద్ధ ప్రాతిపదికన చర్యలు



గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇటీవల సీఎం ప్రకటించారు. అయితే నిధుల్లేక పంచాయతీలు నిర్వీర్యమైపోతున్నాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న రక్షిత మంచినీటి పథకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉంది.

– గద్దం అంకయ్య, కార్యదర్శి, సీపీఎం

తాగునీరు నేలపాలు



వీధుల్లో చేరిన నీరు

- కొమరిక గిరిజన కాలనీలో నీటి కష్టాలు

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గిరిజన కాలనీ వాసులు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే క్రమంలో తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. ఇది జరిగి మూడు రోజుల గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. కాగా నీటి పైపులు పగిలిపోవడంతో నీరు వీధుల్లో చేరి నడిచివెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ముత్తుకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మత్స్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ అన్నారు. కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న బీఎఫ్ఎస్సీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా మల్లూరులో గురువారం మొక్కలు నాటారు. అసోసియేట్ డీన్ ద్వారా మొక్కలు పంపిణీ చేయించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.



మొక్క అందజేస్తున్న అసోసియేట్ డీన్

కండలేరును సందర్శించిన సీఈ

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయాన్ని గురువారం తిరుపతి సీఈ వరప్రసాద్ సందర్శించారు. హెడ్‌రెగ్యులేటర్, స్పిల్‌వే, లోలెవల్ స్లూయిస్, మట్టికట్ట తదితరాలను పరిశీలించి అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. జలాశయంలో ప్రస్తుతం 49.238 టీఎంసీల నీరు నిల్వ ఉందని, చెన్నై, తిరుపతి, నెల్లూరు జిల్లాల ప్రజలకు తాగు, సాగునీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణారెడ్డి, విజయకుమార్ రెడ్డి, రామచంద్రమూర్తి, అనిల్‌కుమార్‌రెడ్డి, ధనంజేయులు, విజయరామిరెడ్డి, తిరుమలయ్య, అనిల్ కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న సీఈ

హైడ్రామా నడుమ ఉప సర్పంచ్ ఎన్నిక

కోవూరు: మండలంలోని ఇనమడుగు పంచాయతీకి ఉప సర్పంచ్ ఎన్నిక గురువారం హైడ్రామా నడుమ సాగింది. ఈ పంచాయతీలోని 12 స్థానాల్లో ఆరింటిని టీడీపీ, వైఎస్సార్‌సీపీ దక్కించుకున్నాయి. ఈ తరుణంలో ప్రలోభాలకు గురి చేసి వైఎస్సార్ కాంగ్రెస్ మద్దతుదారుడ్ని తమ పంచన చేర్చుకున్నారు. మరొకర్ని సమావేశానికి గైర్హాజరయ్యేలా చేశారు. దీంతో టీడీపీకి ఏడుగురి మద్దతు లభించడంతో చేజర్ల మోహన్‌ను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. కాగా వైఎస్సార్‌సీపీతో మద్దతుతో నందు ఉప సర్పంచ్‌గా బరిలో నిలిచారు. గతంలో కుదిరిన ఒప్పందం మేరకు ఇప్పటి వరకు పనిచేసిన ఉప సర్పంచ్ మనికంట రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని చెల్లాయపాళెంలో గ్రామ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు గురువారం దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మహ్మద్ యూనస్, షబ్బీర్, మౌలాలి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం పెడితే మద్దతిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్‌పై ఎవరైనా అవిశ్వాస తీర్మానం పెడితే తమ పార్టీలో ఉన్న ఆరుగురు కౌన్సిలర్లు మద్దతిస్తామని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ షేక్.షాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో సుపరిపాలన కోసం ఎవరైనా అవిశ్వాస తీర్మానం పెడితే తమ అధిష్టానం సూచనల మేరకు మద్దతిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

పొదలకూరు: షబ్ – ఏ – ఖద్రను గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ముస్లింలు రాత్రంతా మసీదులో ఉండి ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ చివరి పదిరోజుల్లో ఐదు తాఖ్‌రాత్రుల్లో ఏదో ఒకరోజును షబ్ – ఏ – ఖద్ర్‌గా నిర్ణయించడం జరుగుతుందని మౌలాన్ ముస్తాక్ మాదనీ వెల్లడించారు. మహిళలు సైతం ఇంటి వద్ద ప్రార్థనలు చేసుకోవచ్చునని తెలిపారు.

3న ద్విచక్ర వాహనాలకు వేలం

ఇందుకూరుపేట : ఏప్రిల్ 3న ఆరు ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలంపాట ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఇందుకూరుపేట ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో జరిగే వేలంపాటలో పాల్గొని, వాహనాలను దక్కించుకోవచ్చని తెలియజేశారు.

చేనేత విభాగం జాయింట్ సెక్రటరీగా జనార్ధన్



చేబ్రోలు జనార్ధన్

విడవలూరు : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాలను కల్పిస్తూ గురువారం ఆదేశాలు వెలువడ్డాయి. ఇందులో మండలంలోని అలగానిపాడు గ్రామానికి చెందిన చేబ్రోలు జనార్ధన్‌ను రాష్ట్ర చేనేత రంగ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకముంచి హోదా కల్పించిన ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏడీఈ కార్యాలయం ప్రారంభం

పొదలకూరు: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్మాణం జరిగిన ఏడీఈ కార్యాలయాన్ని గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ఆక్వా రైతులకు మంచిరోజులు వచ్చాయని, రూ.1.50లకే యూనిట్ విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. విరువూరు, మహ్మదాపురం పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మంజూరైన చెత్త తరలింపు ట్రాక్టర్లను అప్పగించారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలో ఏప్రిల్ 4న ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా ప్రారంభించే డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ శ్రీకాంత్, ఎంపీడీఓ నరసింహారావు, మండల నాయకులు మస్తాన్‌బాబు, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు, వెంకటరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో సర్వేపల్లి వైఎస్సార్‌సీపీ నేతలు



కాకాణి గోవర్ధన్‌రెడ్డితో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

పొదలకూరు: సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నాలుగు రోజులుగా నెల్లూరులో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంట ఉన్నారు. అక్రమ కేసులో ఇరికించి తమ నాయకుడిని పోలీసులు అరెస్ట్ చేస్తారేమోనని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు డైకస్‌రోడ్డులోని ఆయన ఇంటి వద్దే ఉంటున్నారు. కూటమి ప్రభుత్వాన్ని దుయ్యపడుతూ సర్వేపల్లిలో అక్రమ కేసుల పరంపర కొనసాగుతున్నట్టు విమర్శలకు దిగుతున్నారు. మైనింగ్ కేసులో గురువారం కాకాణికి హైకోర్టు బెయిల్ ఇస్తుందని నేతలు భావించారు. అయితే మంగళవారానికి విచారణ వాయిదా పడడంతో కార్యకర్తలు గ్రామాల నుంచి పెద్దఎత్తున నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయం, కాకాణి గృహం వద్దకు చేరుకుంటున్నారు.

పెరిగిన ఎండ తీవ్రత

- నిర్మానుష్యంగా రోడ్లు

పొదలకూరు: మార్చి నెలాఖరు వచ్చేసరికి ఎండ తీవ్రత పెరిగింది. పొదలకూరు కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో ఒకటి నుంచి రెండు డిగ్రీలు అదనంగా ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఉదయం 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గురువారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది ఎండ వేడిమి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందస్తుగా వెల్లడించిన విషయం తెలిసిందే. వేసవి కాలంలో ప్రజలు బయట తిరగడం తగ్గించాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాల్సిందిగా పేర్కొన్నారు.



నిర్మానుష్యంగా మారిన పట్టణంలోని రోడ్డు

నిమ్మ రైతులకు నిరాశే..

- పెరగని ధరలు

పొదలకూరు: మార్చి నెలాఖరు వచ్చినా నిమ్మకాయల ధరలు రైతులు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. సాధారణంగా ఈ నెలలో ధరలు పెరుగుతుంటాయి. అయితే దిగుబడి పెరగడంతో ఢిల్లీ మార్కెట్లో ధరలు పెరగడం లేదని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం బస్తా (లూజు) రూ.4,500 నుంచి రూ.6 వేల వరకు ఉంది. ఇంకా పెరగాలని రైతులు ఆశిస్తున్నారు. నాణ్యత కలిగిన కాయలు రూ.6 వేల వరకు ఉన్నా రైతుల యాజమాన్య పద్ధతులు, ఖర్చుల వల్ల సీజన్‌లో ఇంకా పెరిగితే ఏడాది పొడవునా తోటలపై ఖర్చులు భరించేందుకు వీలుగలుతుందంటున్నారు. కిలోల వంతున చూస్తే రూ.55 నుంచి రూ.75 వరకు ధర ఉంది. దాదాపుగా మార్చి నెలంతా ఇదే పరిస్థితి నెలకొన్నట్టు తెలుస్తోంది. మార్చి తొలివారంలో ఒక్కసారిగా ధరలు పెరిగినా తర్వాత రూ.2 వేలు తగ్గిపోవడంపై రైతులు ఆందోళన చెందారు.



యార్డుకు వచ్చిన కాయలు

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ముత్తుకూరు: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ముత్తుకూరు వైద్యాధికారి దేవీకృప మాట్లాడుతూ నోటి శుభ్రత కూడా చాలా ముఖ్యమన్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. కార్యక్రమంలో దంత వైద్యులు లక్ష్మమ్మ, హెల్త్ విజిటర్ నిర్మలమ్మ, హెల్త్ అసిస్టెంట్ బాలకృష్ణ, హెచ్ఎం లక్ష్మీశ్వరి, ఉపాధ్యాయకులు ఖాదర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దేవీకృప

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించండి

రాపూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైతులు అమ్ముకోవాలని పొదలకూరు వ్యవసాయ సంచాలకుడు శివనాయక్ తెలిపారు. రాపూరు మండలం సిద్ధవరం గ్రామంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దన్నారు. వారు చెప్పే మాయమాటలకు మోసపోవద్దన్నారు. తేమను బట్టి వరి ధర నిర్ణయిస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. ఆయన వెంట వ్యవసాయాధికారి సోమసుందర్, రైతులున్నారు.



రైతులతో మాట్లాడుతున్న శివనాయక్

కాకాణికి మద్దతుగా..

నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు



మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా మద్దతు తెలుపుతున్నారు. గురువారం రాత్రి నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న ఆయన నివాసం వద్దకు చేరుకుని కాకాణిని అక్రమంగా అరెస్ట్ చేస్తే ఊరుకోమంటూ నినాదాలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నెల్లూరు